స్వర్ణలోయలో తెలుగు వెలుగు

కాలిఫోర్నియ తెలుగు సమితి

# తెలుగు వాణి

2013

సంపుటి : 2

సంచిక : 1

పుట : 1



## శ్రీ విజయ నామ ఉగాది శుభాకాంక్షలు

సంస్కృతి సంప్రదాయం సృజ నాత్మకత సంఘసేవ సమిష్టికృషి

కాలిఫోర్నియ తెలుగు సమితి 115 Austin Dr. Folsom CA 95630

---

## విషయ సూచిక


1 ముందుమాట

2 అవ్యక్త మూర్తి

3 ఏమవ్వను? నీ కోసం ఏదవ్వను?

4 అమ్మ

5 తెలుగు వాణి – బాణీ

6 బతుకమ్మ పండుగ

7 సంవత్సరాది సందేశం

8 CTS సామెతలు

9 తెలుగు వాణి అభిరుచి

10 నాన్నకు జే జే

11 ప్రాతఃకాలము


## ముందు మాట

**"సర్వేజనః సుఖినోభవంతు"**

సంవత్సరాది సూర్యోదయాన దివ్య తేజోమయుడై తూర్పుదిక్కున ఉదయించే సూర్య భగవానుడు మన జీవన సరళిలో కొత్త ఉత్సాహాన్ని నింపి సద్భావాన్ని పెంపోదించాలని ప్రతి ఉదయం ఒక పరిపూర్ణ శుభదినానికి నాంది పలకాలని ఆశిద్దాం. వసంతరంభం తొలి రోజునించే ప్రకృతి మనకు మంగళ కరంగాను వీనుల విందుగాను ఉంటుంది. భూమిపైన పూవులు రాసులుగా పూస్తాయి కోకిల కూతలు వినిపిస్తూ ఉంటాయి. వసంతాగమనానికి సంకేతంగా మామిడి చెట్టు కెంపులను తలపించే ఎర్రని చిగుళ్ళతో కనువిందుచేస్తూ ఉంటుంది. రంగురంగుల పుష్పములతో శోభించునదై ఇంపులతో సొంపులతో ఆనందముగా ఈరోజు వసంతఋతువు వచ్చింది. శ్రీ విజయనామ సంవత్సరము మానవాళికి సద్భావనని ప్రసాదించి విశ్వ శాంతి నెలకొల్పాలని ఆనందదుందుభినాదాన్ని మ్రోగించాలని మనసారా కోరుకుందాం.

**యద్భావంతద్భవతి** అన్నారు గీతలో శ్రీకృష్ణుల వారు. అంటే మన తలంపుఎలా ఉంటె ఆ పనికి ఫలితం కూడా అలాగే ఉంటుంది అని దానర్ధం. సమస్త జీవరాసులలోకెల్ల మహామేధావి యైన మనిషి సద్భావన కలిగి నడచుకుంటేఅది తనకే కాకుండా తన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.ఆలోచనా శక్తిని సరైన రీతిలో ఉపయోగించక పోతే ఎన్నో దురదృష్టకరమైన సంఘటనలను ఎదుర్కోవలసి వస్తుంది. చెడు ప్రవర్తన వలన వచ్చే దుష్ఫలితాలు మన చుట్టూఉండే సమాజంలో ప్రతిబింబిస్తూ ఉంటాయి. సమాజంలో శాంతి లోపిస్తుంది. అందుకు భిన్నంగా ప్రతిఒక్కరు సత్ప్రవర్తన కలిగి వుంటే విశ్వశాంతి ని సాధించవచ్చు. మనము మన పిల్లలు ఉండే సమాజాన్ని ఒక శాంతి నికేతనంలా మలచుకోవాలంటే ఇతరుల మనసును నొప్పించే విధంగా మాట్లాడక పోవటం,సత్యం పలకటం వేదాధ్యనం చేయటం

మొదలైనవి అలవరచుకోవాలి. అలాగే ఎదుటివారిని తూలనాడటం, ఎగతాళిచేయటం ఎదుటివారిని అర్థం చేసుకోక పోవటం మొదలైన వాటిని త్యజించాలి. మంచిని ఆచరిస్తూ, మంచిని చెప్పటం, మంచి గ్రంధాలు చదవటం, సజ్జన సాంగత్యం చేయటం ద్వార సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని సాధించవచ్చు. చక్కని నడవడిక భావి తరాలవారికి కూడా మార్గ దర్శకమౌతుంది. మనదైనందిన కార్యక్రమాలలో ఈ మార్పుని తెచ్చుకోవటం ఒక తపస్సు లాంటిది. ఈ శారీరక మానసిక, వాచక తపస్సును ఆచరిస్తూ మన జీవితాలని నందన వనాలుగా తీర్చిదిద్దుకోవటమే కాక మన తోటి వారికి హాయిని ఆనందాన్ని కలిగించటమే పరిపూర్ణమైన తపస్సు.మనం ప్రయత్నిస్తే ఏ పనినైన సాధించగలం. ఈ ఉగాదిని ఒక శాంతి సంవత్సరాదిగా పరిగణిద్దాం. ఈ విజయనామ సంవత్సరంలో మనమందరం సద్భావనని అలవారచుకుందాం.

లోకాసమస్తాః సుఖినోభవంతు.

సంపాదక వర్గం

శ్రీదేవి రావి | రమామణి ఆకెళ్ళ | కుమార్ కలగర

literary@californiatelugu.org , Telugu Vaani, 115 Austin Dr Folsom CA 95630

## అవ్యక్త మూర్తి

" సన్యాసి "

ఎవని చేదోయి నించి ఈ మహా సుందర జలపాతాలు
శైల శిఖరాగ్రాలనించి క్రింద చరియలపై జాలువారె ?
ఎవని వూహాలు ఈ సప్త ద్వీప వసుంధరని సృజియించె ?
ఎవని అనంత జ్ఞానశక్తి సర్వ మానవాళికి
బుద్ధి నొసగినీ జగతి నడిపె ?
ఎవడు తన అజ్ఞాత శక్తిచే ఈ భువన బ్రహ్మాండమెల్ల త్రిప్పు ?
ఎవని వెలుగుచేనీ తారకా చంద్ర సూర్య సహిత
సర్వగోళములన్ని వెలిగి పోవు ?
ఏమాయచే మనకు శీతోష్ణ సుఖదుఖాదులెల్ల:
స్వానుభవైక వేద్యమాయె ?
ఏ ఐంద్రజాలికుడు సస్యశ్యామలంబైన
పంటపొలాల, వనాలనెల్ల సృజియించి ఇచ్చె ?

ఏ మాయావి తన హస్తమ్ము నూచి
ప్రళయ ఝంఝూమారుతమ్ము వీపె మనపై ?

ఎవని కృపచే ఉదయాస్తమాలలో
పూలవాసనలతో చల్లని పిల్ల వాయువులు వీచె ?
ఎవడు చిన్నారి పాపల బోసి నవ్వుల కారణంబు ?
వాడె వృద్ధుల పండు నొసటొమల వెనక దాగియున్న
ఆర్ద్రతా పూరిత మమతల వృద్ధి జేయు.
ఎవడు సర్వ కర్మ కర్తృత్వముల కధినేత ?
వాడె సర్వఫలభోక్తృత్వముల దాత
ఎవడు పంచకోశాత్మక మానవాళిని సృజియంచి
తోడుగా పాంచభౌతిక బ్రహ్మాండంబు కానుకగ నొసంగె ?
ఎవడనామయుండు వాగామగోచరుండు ?
ఎవడు సర్వజ్ఞుండు సర్వశక్తి సమన్వితుండు ?
సర్వేశ్వర నియుక్తుండు ? సర్వమును శాసించువాడు?
నామరూపరహితమౌ మహా చైతన్య శక్తి
జీవ జగదీశ్వర త్రిపుటిగా భాసించు మూర్తి.
జనన,జీవనమరణాల మూల కారణమ్ము తానె .
వానినొక విగ్రహమ్ముగా మలిచి పూజింపజాల
పేరు, ఊరు లేనివాని పేరు పెట్టి పిలువజాల
వాని నశీరీరు, గుడికట్టి బంధింపజాల
నేనె నా శరీర దేవళమ్ము వీడి,
ఆ అవ్యక్తమూర్తిలో కలిసిపోదు కలిసి
ఈ సుందర ప్రకృతినెల్ల తానుగా తలపోసి
తిలకించి తరియింతు నెపుడు.

"దేహో దేవాలయ ప్రోక్తః; జీవొ దేవస్సనాతనః అన్న ఆర్యోక్తి ",ఇంతకు ముందు చేసిన వివిధ దేశాటనాలలో సుందర ప్రకృతి దృశ్యాలూ గుర్తుకి వచ్చినప్పుడు నాలో అద్వైత భావనలకు అంకురార్పణ చేసిన బ్ర;శ్రీయల్ల :ం రాజు శ్రీనివాస రావుగారికి ఈ భావ సుమాంజలి.....

## CTS సామెతలు

కాలి కి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి
ఏో రు నష్టం ఏొందు లాభం

రా  మాయణం లో పిడకలవేట
య  ధార్థ వాది లోక విరోధి

తె  గే దాక లాగ వద్దు
లు  బ్ధునికి దానం లోక సంతాపం
గు  రువుకు పంగనామాలు పెట్టినట్లు

స  ◌ంతోషం సగం బలం
మి  ◌ంగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె !
తి  న్న ఇంటి వాసాలు లెక్క పెట్టినట్టు

## ఏమవ్వను? నీ కోసం ఏదవ్వను?

అనామిక

ఈ  సాయం సంధ్య వేళ
ఏమవ్వను?
నీ కోసం ఏదవ్వను?

నిను తాకుతున్న
అస్తమించే రవికిరణానినవ్వనా?

నీ నుదిటి నలంకరించిన
బొట్టు నవ్వనా?
నీ పెదవుల నలంకరించిన
లేత గులాబీ రంగు నవ్వనా?
ఏమవ్వను?

నీ చెవిని తాకిన
కర్ణ కుండలమునవ్వనా?

నీ శిరము నుండి
అలవోకగా జారే
ముంగురులవ్వనా?
ఆ ముంగురుల నుండి
జాలు వారే
నీటి బిందువునవ్వనా?

బంగారు రంగులో
మెరిసే నీ మెడమీది
పుట్టుమచ్చని అవ్వనా?

అదిరే నీ ఎదపై
జారే పైట కొంగునవ్వనా?

నీ మదిలో మెదిలే
కదలిక నవ్వనా ?
ఏదవ్వను?

---

నీ హృదయ వీణ పలికే
మధుర గీతానవ్వనా?

ఆ చీర కుచీళ్ళు దోపే
నీ నును లేత వేళ్ళ
మృదు స్పర్శ నవ్వనా?

నీ మడిమ తాకిన
మువ్వని అవ్వనా ?
నీ అడుగుతో
ఘల్లు ఘల్లు మనే
ఆ అందియల
సవ్వడినవ్వనా ?

నీ పాదం సోకిన
ఇసుక రేణువునవ్వనా?

ఈ పున్నమి రేయిన
పండు వెన్నెలవ్వనా ?

ఆ నింగి నుండి
కురిసే స్వాతి ముత్యపు
చిరుజల్లునవ్వనా?

ఏమి అవ్వను
ప్రియతమా?
నీ కోసం ఏదవ్వను?

## అమ్మ

మధు ప్రియ

అమ్మ అనేది రెండక్షరాల మాట
అవనిలో అది పరిపూర్ణ సుస్వరాల మూట
సహనానికి ప్రతీక భూమాత
చదువులతల్లి సరస్వతి మాత
దుష్ట వినాశ అభయంకరి  కాళీ మాత
మనలను సదా పరిరక్షిస్తున్న తల్లులెందరో
అభాగ్యుల ఆప్తురాలు మదర్ తెరీసా
మతఛాందసుల పాలనలో మ్రగ్గుతున్న సామాన్యుల స్వాతంత్ర్యం కొరకు శ్రమిస్తున్న ఆంగ్ సాన్ సూకీ
పేదలకోరకు పథకాలనేన్నో ప్రవేశపెట్టి రాజకీయాల లోనే క్రొత్త ఉరవడిని తెచ్చిన ఇందిరమ్మ
ఎందరో మాతలు, మహోన్నత మూర్తులు
క్రూరుడైన బిడ్డపై కరుణచూపేది తల్లి
హంతకుడినైనను హత్తుకునేది తల్లి
అనురాగానికి అర్థం చెప్పేది తల్లి
అందుకే అంటారు అమ్మలేని జీవితం అర్థరహితం

---

ఆప్యాయతకు ఆరోప్రాణమే అమ్మ
సకలచరాచర సృష్టికి మూలం అమ్మ
మంచి మనస్సుతో మమకారాన్ని మందికి పంచేదే అమ్మ
మానవతాధృక్పదానికి మరో పేరు మాతృమూర్తి
అమ్మ ప్రేమ లాలిత్యాన్ని పొందిన మనిషి జీవితం ఎంతో సుమధురం, సుసంపన్నం
ప్రతి రోజు అమ్మ రోజే అందుకే మాతృత్వానికే వన్నెతెచ్చిన ప్రపంచములోని తల్లులందరికీ
ఇవే మా హార్ధికాభినందనాలు

## తెలుగు వాణి – బాణీ

శ్రీదేవి రావి

ప్రకృతి భగవంతుని అద్భుత సృష్టి. వసంత ఋతువు ఆగమనంతోనే చిగురించిన చెట్లు,పచ్చని చెట్లను చూసిన పశు పక్ష్యాదులు సైతం కూడా పరవశిస్తాయి ఆ మధురానుభూతిని . కోకిలగానంతో, నెమలి నాట్యం తో అభినయిస్తూ ఉంటే, ఈ నేల విరిసిన హరివిల్లులా విరబూసిన సప్తవర్ణాల పుష్పాలతో తివాచీ పరుస్తుంది. ఈ సమయంలో ఇలా చెయ్యాలని వీళ్ళకి ఎవరు నేర్పారో కదా?

### ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు

**సినిమా:** ఈనాటి బంధం ఏనాటిదో

**సంగీతం :** ఎస్ రాజేశ్వరరావు గారు.

**సాహిత్యం:** దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు

**గానం:** పి. సుశీల గారు

ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ
ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకు .....
ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకు
ఎంత తొందరలే హరి పూజకు
ప్రొద్దు పొడవకముందే పూలిమ్మనీ .....
ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకు

కొలువైతివా దేవి నాకోసము .....
కొలువైతివా దేవి నాకోసము
తులసీ తులసీ దయాపూర్ణకలశీ .....
మల్లెలివి నా తల్లి వరలక్ష్మికి .....
ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ ఆ

మల్లెలివి నా తల్లి వరలక్ష్మికి .....
మొల్లలివి నన్నేలు నా స్వామికి

ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకు
ఎంత తొందరలే హరి పూజకు

కాలిఫోర్నియ తెలుగు సమితి

స్వర్ణలోయలో తెలుగు వెలుగు

# తెలుగు వాణి

2013

సంపుటి : 2

సంచిక : 1

పుట : 8

---

ప్రొద్దు పొడవకముందే పూలిమ్మనీ .....

ఏ లీల సేవింతు ఏమనుతు కీర్తింతు .....
ఏ లీల సేవింతు ఏమనుతు కీర్తింతు
సీత మనసే నీకు సింహాసనం

ఒక పువ్వు పాదాల    ఒక దివ్వె నీ మ్రోల . .
ఒక పువ్వు పాదాల    ఒక దివ్వె నీ మ్రోల . .
ఒదిగి నీ ఎదుట ఇదే వందనం .....
ఇదే వందనం .....

## బతుకమ్మ పండుగ

రేఖ లేగాల

బతుకమ్మ పండుగ నాకు చాలా ఇష్టమైన పండుగ. ఎందుకంటే ఇది ముఖ్యంగా తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ. బతుకమ్మ పండుగ ప్రతి ఏట దసర, నవరాత్రులకు ముందు ఆరంభవం అవుతుంది. తెలంగాణ ఆడపడుచులు ఎప్పుడు ఎప్పుడు అని ఎదురు చూసే పండుగ. ఈ పండుగను జరుపుకోవడానికి ఆడపడుచులు అత్తవారింటి నుండి పుట్టింటికి వచ్చి బతుకమ్మ పండుగలో తోటి స్నేహితులతో, బంధువులతో సంతోషాన్ని పంచుకుంటారు. పట్టు వస్త్రాలను ధరించి, నగలు వేసుకొని చాలా అందముగా తయారు అవుతారు.

తెలంగాణ జానపద గేయాలలో బతుకమ్మ పాటలకు ఒక ప్రాముఖ్యత వుంది. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు గౌరమ్మ ఉయ్యాలో", "ఒక్కేసి పువ్వేసి చందమామ, ఒక జాము ఆమె చందమామ" అంటూ తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ఆడపడుచులు, ఇరుగు పొరుగు అమ్మలక్కలు కలిసి ఆనందముగా నృత్యం చేయడం కన్నుల పండుగగా ఉంటుంది.



ఈ నానుడిలో ఉన్న ఒక చిన్న కథ తెల్పుతున్నాను. పూర్వము దక్ష ప్రజాపతికి తన కుమార్తె సతీదేవి మహాశివుడిని వివాహం చేసుకోవడం ఇష్టం లేదు. సతీదేవికి సర్వజగత్తుకు నాయకుడు అని తెలుసు కనుకనే ఆయనను భర్తగా స్వీకరిస్తుంది. ఆయనను మరింత అవమానించే దురుద్దేశంతో దక్ష రాజు ఒక యజ్ఞాన్ని తలపెడతాడు. ముల్లోకంలో మునులను, దేవతలను, ఋషులను ఆహ్వానించి దక్షుడు తన అల్లుడైన మహాశివున్ని ఆహ్వానించడు. తనకు పిలుపు

---

లేకపోయినా వెళ్ళిన సతీదేవి, తన భర్తకు జరుగుతున్న అవమానం సహించలేక ఆత్మ త్యాగము చేసుకుంటుంది. ఈ దేవి మరల జన్మించడము కోసం మహిళాలోకం అంత చేస్తున్న పండుగ బతుకమ్మ.

ఈ పండుగకు పువ్వులు చాలా ముఖ్యమైనవి. ఉదయాన్నే లేచి స్నేహితులతో కలిసి పువ్వులను తీసుకుని రావడం చాల సరదాగా వుంటుంది. బతుకమ్మ చెయ్యడానికి ఉపయోగించే పువ్వులు గానుగు, తంగేడు ముఖ్యమైన పువ్వులు. ఆయుర్వేద శాస్త్ర ప్రకారం ఈ పువ్వులకు ఔషద గుణాలు ఉన్నాయి. ఆయువు, ఆరోగ్యాలను పంచే శక్తి ఈ పువ్వులకు ఉంది. ఇంకా బంతి, చామంతి, తామర, కట్ల, గుమ్మడి తదితర పువ్వులను కూడా బతుకమ్మ తయారు చెయ్యడానికి ఉపయోగిస్తారు. ఇలా రకరకాల పువ్వులను సేకరించి వాటిని పెద్ద పళ్ళెంలో వరుసగా పేర్చి చాలా అంతస్తులుగా పెంచుతారు. పసుపుతో తయారు చేసిన గౌరమ్మను బతుకమ్మపైన పెట్టి పూజిస్తారు.

తొమ్మిదవ రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని కూడా అంటారు. ఈ రోజు అందరు పోటా పోటీగా ఒక్కరిని మించి ఒక్కరు బతుకమ్మలను పెద్దగా చేస్తారు. ఇంకా స్త్రీలు పసుపు, కుంకుమలను ఇచ్చి పుచ్చుకుని వాళ్ళ సౌభాగ్యం నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని, ఆడపిల్లలు వాళ్లకు అందమైన మంచి జీవితం కోరుకుని గౌరీ దేవిని పూజిస్తారు. ఇంకా సత్తుపిండి, నవధాన్యాల పిండి, బెల్లంతో చేసిన సద్దు ముద్దలను, పులిహోర, పెరుగన్నం తీసుకు వెళ్లి దేవికి ప్రసాదము అర్పిస్తారు. తరువాత అందరు ప్రసాదాన్ని స్వీకరిస్తారు.చివరగా బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి మళ్లీ వచ్చే సంవత్సరము రమ్మని పూజిస్తారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు చిహ్నంగా ఈ పండుగను భావిస్తారు.భారతదేశంలో తెలంగాణ వాసులు ఈ పండుగను అతి పెద్దగా జరుపుకుంటారు.

## సంవత్సరాది సందేశం

వాణి కోట్ర

"కోయిల పిలుపే, కోనకు మెరుపు..." అన్నారు మహాకవి డా.సి. నారాయణ రెడ్డి గారు.అది అక్షర సత్యం. అందాల ఆమని రాకని తెలిపేదే కోయిల పిలుపు. ప్రకృతి అనేక వొడిదుడుకులకు లోనై కొత్త పూతలతో కొంగ్రొత్త కాంతులతో విరాజిల్లుతుంది. వన్నెలీను వసంత ఋతు ఆగమనానికి పలికే స్వాగత సత్కారాలే ఉగాది సంబరాలు. ఇదే కాల చక్రానికి తొలి ఋతువైనందున దీనిని సంవత్సరాదిగా, యుగాదిగా పరిగణిస్తారు. మన తెలుగు సంవత్సరనామాలుప్రభవ, విభవ మొదలుకొని ప్రతి అరవై వార్షికాలకు పునరావృతమవుతూవుంటుంది. ఈ పండుగని మనముచైత్ర మాసంలో పాడ్యమి పర్వదినాన ఆనందోత్సాహాలతో జరుపుకుంటాము.

---

కాల ప్రవాహంలో ప్రకృతి ఏన్నో ఆటు పోట్లకి గురౌతుంది. ఆమనిలో అందాలనందుకుని ఆనందడోలికల్లో హాయిగా తేలియాడుతుంది. శరస్చంద్రికలు కవులని, ప్రేమికులని, అరమరికలు లేని అనురాగ దంపతులని అక్కున జేర్చుకొని అలరారే శరదృతువుని ఆహ్లాదంగా గడిపేస్తుంది. ఇంతలోనే, గ్రీష్మ తాపాన్ని ఉక్రోషంతో పంటి బిగువున భరించినా, ఉప్పెనలకి ఆనవాలమైన వర్షరుతువులో కన్నీరుమున్నీరౌతుంది. ఐనా ధైర్యాన్ని కోల్పోకుండా హేమంతమందు మంచు తుఫానులతో భీభత్సంగా పోరాడుతుంది. చివరికి, ఏమీ చెయలేక నిస్సహాయంగా, రాలే ఆకులవంక దీనంగా చూస్తూ, ఆమని వస్తుందన్న ఆశావహ దృక్పదంతో శిశిరాన్ని వెళ్ళబుచ్చుతుంది.

మానవుని జీవితం కూడ ప్రకృతిలాగే ఆనంద, ఆహ్లాద, ఉక్రోష, పోరాట, కన్నీటి, భాధల సమ్మేళనమనే విషయాన్ని తెలిపేదే షడ్రుచులతో( తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు) కూడిన ఉగాది పచ్చడి. అన్నిటిని రంగరించి సమదృష్టితో స్వీకరించాలనేదే ఈ పండుగ తెచ్చే సందేశం. దీనిలో కొద్దో గొప్పో ఆకళించుకొని సాదరంగా శ్రీ విజయ నామ సంవత్సరాన్ని ఆహ్వానిద్దమా !

## తెలుగు వాణి అభిరుచి

## ఉసిరికాయ పులిహోర

రమామణి

ఉసిరికాయ ఆరోగ్యానికి చాలా మంచిది. చలికాలంలో విరివిగా దొరికే ఈ ఉసిరికాయలతో పచ్చడి, పప్పు, ఆవకాయ, పులిహోర చేసుకుంటారు. పుల్ల పుల్లగా ఉండే ఉసిరికాయ పులిహోర తయారీవిధానం తెలుసుకుందాం.

**కావలసినవస్తువులు**



- అన్నం – 1 గ్లాసు /200 gms
- ఉసిరికాయలు – 6
- పసుపు – 1/4 tsp
- పచ్చిమిరపకాయలు – 4
- కరివేపాకు – 2 రెబ్బలు
- ఆవాలు – 1/4 tsp
- జీలకర్ర – 1/4 tsp
- మినప్పప్పు – 1 tsp

---

ఇంగువ – చిటికెడు

కొత్తిమిర – 2 రెమ్మలు

ఉప్పు – తగినంత

నూనె – 3 tbsp

అన్నం మెత్తగా కాకుండా ప్రతి పలుకు విడివిడిగా ఉండాలి. ఒక వెడల్పాటి గిన్నెలో అన్నంలో తగిన ఉప్పు కలిపి చల్లారనివ్వండి. ఉసిరికాయలు కడిగి , తడి లేకుండా తుడిచి తురిమి పెట్టుకోవాలి. ప్యాన్ లో నూనె వేడి చేసి ఇంగువ వేయాలి. ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక నిలువుగా చీల్చిన పచ్చిమిరపకాయలు, మినప్పప్పు వేసి కొద్దిగా వేపాలి. ఇప్పుడు పసుపు, కరివేపాకు, ఉసిరికాయ తురుము వేసి నిమిషంపాటు వేయించి దింపి అన్నంలో వేసి బాగా కలియబెట్టాలి. అలాగే సన్నగా కట్ చేసుకున్న కొత్తిమిర కూడా కలిపి పది నిమిషాలు అట్టే పెట్టి సర్వ్ చేయాలి. పచ్చిమిరపకాయల బదులు ఎండుమిరపకాయలు కూడా వేసుకోవచ్చు.

## నాన్నకు జే జే

**కలగర కుమార్**

తలిదండ్రులంటే యిష్టం లేని వారుండరు. అలాంటప్పుడు మానాన్నగారంటె నాకు ఇష్టం అని మీకందరికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏముంది. ప్రత్యేకమైన ప్రత్యేకత లేకపోయినా ప్రతి తలిదండ్రుల పెంపకంలో ఒక వినూత్నత, విశేషం మరియు ప్రత్యేకమైన పద్దతులు వుంటాయి. సామాజిక, కుటుంబ, ఆర్థిక మరియు ఆ-రోగ్య పరిస్థితులు ఇంటికి పెద్ద అయిన (సామాన్యంగా) తండ్రిని క్లిష్ట మైన పరీక్షలకు గురిచేస్తుంటాయి. యెన్నో కష్టాలకు, పరీక్షలకు గురైన మన తలితండ్రులు మన కోసం యెన్నో త్యాగాలు చేసి మనని మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దుతారు. మా నాన్నగారు అదే చేసారు వారిదైన పద్దతిలో. ఆ పద్దతులు, వాటిలోని వినూత్నతలే నన్ను ఈనాడు మీ ముందుంచాయని నా నమ్మకం. అందుకే మా నాన్నగారికి జేజేలు.

మానాన్నగారు కలగర రవీంద్రుడు, 1919 లో కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలో పుణ్యదంపతులైన కలగర పూర్ణయ్య మరియు రంగమ్మ గార్లకు జన్మించారు. ముగ్గురు అన్నదమ్ములలో మా నాన్నగారు రెండవవారు. వారికి ఒక చెల్లెలు. మానాన్నగారు 1937లో విద్యాభ్యాసం పూర్తి అయ్యాక కొన్ని సంవత్సరాల పాటు Maruti Companyలో (English) సినిమాలు పంపిణీ చేసారు. ఈ సమయంలో ఆయన దేశమంతా విస్తృతంగ ప్రయాణం చేసారు. సందర్భం వచ్చినప్పుడల్లా ఆయన మాకు వారి అనుభవాలను విడమరిచి చెబుతుండేవారు.

కాలిఫోర్నియ తెలుగు సమితి
స్వర్ణలోయలో తెలుగు వెలుగు
# తెలుగు వాణి
2013
సంపుటి : 2
సంచిక : 1
పుట : 12

1941-42లో మానాన్నగారు, మా తాత (మా అమ్మ గారి తండ్రి - శ్రీ త్రిపురనేని వెంకయ్య గారు) గారి ప్రోద్భలంతో నిజామాబాదు జిల్లాకు వలస వచ్చారు. మా గ్రామం (ధర్మారం) ఏర్పడడానికి ముఖ్య కారణం మా తాతగారు, మానాన్నగారేనని ఊరివారందరు అంటారు. తెలుగే కాకుండ ఆంగ్ల, ఉర్దూ మరియు హిందీ భాషల్లో కూడ మంచి ప్రావీణ్యం వున్న మానాన్న గారు జిల్లా అధికారులతో (ముఖ్యంగా నాటి ముస్లిం అధికారులతో) సంప్రదింపులు జరిపి గ్రామాభివృద్ధికి బాగా తోడ్పడ్డారనికూడ గ్రామస్తులంటారు. గ్రామ పంచాయితి కార్యాలయ నిర్మాణంలోను, ఉన్నత పాఠశాల నిర్మాణంలోను చాల కీలక పాత్రవహించారు. రాజకీయలకు దూరంగ తనదైన శైలితో గ్రామ ప్రజలకు సహాయం చేసే వారు. తెలంగాణలో జరిగిన అనేక రాజకీయలకు (Razakar-Police action, Andhra-Telangana movement) అతీతంగా వుంటు అందరికి సహాయం చేసె వారు.

వ్యవసాయమే జీవనాధారంగా మానాన్నగారు మమ్ముల్ని పెంచి పెద్దచేసారు. మా తలితండ్రులకు మేము పదకొండు మంది సంతానం (ఐదుగురు కొడుకులు ఆరుగురు కూతుళ్ళు). నేను కుమారుల్లో ఆఖరివాడ్ని, వరుసక్రమంలో నేను పదవ వాడిని. అందరిలానే మానాన్న గారికి కూడా చదువంటే చాలా ఇష్టం. ఆడ మగ అన్న తేడ లేకుండ అందరిని చదువుకొమ్మని ప్రోత్సహించేవారు. నాకు తెలిసిన కుంటుంబాల్లో, మా రెండవ అక్కయ్య M.B.B.S పాసై విదేశాలకు వెళ్ళిన మెదటి మహిళ. చదువు కుంటానంటే ఎక్కడికయినా పంపించడానికి సిద్ధంగా వుండేవారు.



మా నాన్నగారంటే మాకందరికీ (మా బావలకు కూడ) భలే భయం. కాల క్రమేణా అర్థం అయ్యింది అది భయం కాదు భక్తి, గౌరవం అని. మా కెవ్వరికీ గుర్తులేదు మానాన్నగారు ఎవ్వరిమీద కోపంగా అరవడం. ఇక కొట్టడం అన్నది కలలోని మాట. నాన్నగారంటే ఎంత భయం వున్నా ఒక్కసారి ఏదురుగా నిలబడితే మాత్రం మేమందరం చాలా చనువుగా మాట్లాడేవాళ్ళం.

నాకు గుర్తున్న వాటిల్లో నన్ను ప్రభావితం చేసిన కొన్ని ముఖ్యమైన సంఘటనల విషయాలు.

అది 1977, నేను 8 వ తరగతి చదువుతున్న రోజులు. ఒక రోజు ఎప్పటిలానే స్కూల్ నుండి ఇంటికి వచ్చాక అమ్మ యిచ్చిన చిరుతిండ్లు తింటుంటే చెయ్యి జారి చేతిలోని వన్ని నేల మీద పడిపోయాయి. అక్కడే వున్న పని వాడిని పిలిచి, పడినవి శుభ్రం చెయ్యమన్నాను. ఇదంతా చూస్తున్న నాన్నగారు పనివాడిని వాడు అప్పటివరకు చేస్తున్న పని చెయ్యమని చెప్పి, పడేసింది నేను కాబట్టి నన్నే శుభ్రం చేయమన్నారు. నాకు విపరీతమైన కోపం వచ్చింది కాని నాన్న అంటే భయం కదా, చెప్పిన పని చేశాను కాని అవమానించబడ్డానన్న ఆలోచన నన్ను తొలిచి వేస్తోంది. భోజనం సమయానికి కూడ నా కోపం తగ్గలేదు. అమ్మ భోజనానికి రమ్మంటే నాకు ఆకలిగా లేదు అని మూతి ముడుచుకొని కుర్చున్నాను కోపంతో. సామాన్యంగా బుజ్జగించి అన్నంపెట్టే అమ్మకూడ నన్ను వదిలేసి మిగతావాళ్ళందరికి భోజనం పెట్టేసింది. రాత్రి 10 గం.కు అందరు పడకకు సిద్దం అవుతున్నారు, కాని నేను భోజనం చేయ్యలేదే అన్న ఆలోచన ఎవ్వరికి వున్నట్లు అనిపించలేదు. ఆకలికి ఆగలేక అమ్మదగ్గరికి వెళ్ళాను. వంటగది మూసేశాను మళ్ళీ తెరవాలంటే నాన్న గారి అనుమతి కావాలి తెచ్చుకో అంది. భయం భయంగానే నాన్నగారి దగ్గరకు వెళ్ళాను. శబ్దం రాకుండ (అంటే గొంతులోని మాట గొంతులోనే ఉందన్నమాట) అడిగాను. కాదు అడిగానుకున్నాను. "ఎందుకు తినలేదు?" అని అడిగారు. మాట్లాడడానికి ధైర్యం చాల లేదు. "నేను నిన్నే ఎందుకు శుభ్రం చేయమన్నానో తెలిసిందా?" అని అడిగారు. లేదన్నాను. ఆయన " ఇంకొకరి మీద అధికారం చెలాయించే ముందు, ముందుగా నీ పని నీవు చెసుకోవడం నేర్చుకో" అంటుండగా, అమ్మ "నాకు కూడ ఆకలిగా వుంది, నిద్రకూడ ముంచుకు వస్తోంది, మీ తండ్రికొడుకులు కబుర్లు ఆపితే భోంచేసి పడుకోవచ్చు" అంది. అప్పుడర్థమైంది నా గురించి ఆలోచించే వాళ్ళు ఎప్పుడూ వుంటారని. భోజనం చేస్తున్నప్పుడు అమ్మ అడిగింది నాన్నగారి మాటల్లో ఏమర్థమైందని. ఆరోజు అర్థమైయింది తక్కువే అయినా తరువాత అలోచించినా కొద్ది ఎన్నో విషయాలు తెలిశాయి. ఇంకా క్రొత్త క్రొత్త విషయాలు తెలుస్తూనే వున్నాయి. వాటిల్లో కొన్ని 1. ఏ పనీ చిన్నది కాదు (No job is trivial). 2. ఏ పనీ విలువ తక్కువది కాదు (Value of work). 3. అన్ని పనులు గౌరవప్రదమైనవే (Prestige of labor) 4. పనిలోని లోతుపాతులు తెలుసు కోవాలి (Know the complexity of work). 5. తెలవని పనిని పూర్తి చేయడం అసాధ్యం (You cannot manage / complete the work unless you know the

కాలిఫోర్నియ తెలుగు సమితి
స్వర్ణలోయలో తెలుగు వెలుగు
# తెలుగు వాణి
2013
సంపుటి : 2
సంచిక : 1
పుట : 14

work). ఏ పాఠశాలల్లో, పుస్తకాల్లో ఇలాంటివి నేర్పుతారో నాకు తెలియదు కాని మా నాన్నగారు నాకు ఆపాదించిన మహోన్నతమైన విద్య, తరగని ఆస్తి. ఇది నేను ప్రతిరోజు నా ఉద్యోగంలో పాటించే మొదటి సూత్రం.

డబ్బు, పొదుపు విషయాల్లో ఆయన మాకందరికి ఇచ్చిన ముఖ్య ఉపదేశం "రుపాయి సంపాదిస్తే దానిలో కనీసం ఒక్క పైసానయిన మిగల్చాలి, అలా మిగల్చలేని నాడు మీరెంత సంపాదించినా మీకు సరిపోదు". Financial Planning లో ఆయన ఈ principle ని తూచాతప్పకుండా పాటించారు. అలా చెయ్యకపోతే పదకొండు మంది సంతానానికి కావలిసినవన్ని సమకూర్చగలిగేవారా? ఈ సూత్రాన్ని నేను నేటికి పాటిస్తున్నాను. నా కుమారుడికి నేనిచ్చే పెద్ద ఆస్తి కూడ యిదే నేను పదవ తరగతి చదువుతున్నప్పుడు నాకు నెలకు 20 రుపాయలు pocket-money యిచ్చేవారు. అవి నెల మొదటి పది రోజుల్లోనే అయిపోయేవి. తరువాత అమ్మను బ్రతిమాలి మరి కొంచం తీసునేవాడ్ని. నాన్నగారికి తెలియదను కుంటూ వుండేవాడిని. తరువాత అర్థమయ్యింది శివుడి ఆజ్ఞ లేనిదే చీమయిన కదలదని. నా కోరికలు పెరగడంతో మా అమ్మ నన్ను మా నాన్న గారినే అడగమంది. ధైర్యం తెచ్చుకొని అడిగాను. నా pocket-moneyని 30 రుపాయలకు పెంచి, ప్రతినెల ముందటి నేలలో ఖర్చు వివరాలు చూపించి తరువాతి నెల pocket-money తీసుకోమన్నారు. ఓ! ఇంతేకదా అని ఆనందంగా వెళ్ళి నెలాఖరుకి లెఖ్ఖ రాసుకొని మా నాన్న గారి దగ్గరకు వెళ్ళాను. వివరాలు చూడకుండ, ప్రతి ఖర్చు ముందు అది అవసరమా! లేదా? అని నన్నే ప్రశ్నించుకొమ్మన్నారు. అంతే మరెప్పుడు pocket-money తక్కువవ్వలేదు.

November 12 1982 మా నాన్నగారికి రోగ్యం బాగాలేకపోతె అంతకు ముందు 10 రోజులనుండి ఆసుపత్రిలో వున్నారు. ముందు రోజు డాక్టర్లు ఇప్పుడు కొంచం పర్వాలేదు మీరు రేపు ఇంటికి తీసుకొని వెళ్ళవచ్చు అన్నారు. ఆరోజు రాత్రి (11 నాడు) నేనే ఆసుపత్రిలో వున్నాను. తెల్లవారు జామున సరిగ్గా నిద్రపట్టనందువల్ల అటు ఇటు దొర్లుతున్న నన్ను నాన్నగారు పిలిచి, ఆయన జీవితంలో నేర్చుకున్న ఎన్నో పాఠాలను, కలిగిన అనుభవాలను, కలిసిన రకరకాల మనుషులను, వారి మనస్థత్వాలను వివరంగా చెబుతున్నారు. ఏందుకో ఈ రోజు నాన్నగారు చాలా ఎక్కువ మాట్లాడుతున్నారు అనుకుంటుండగ అమ్మలేచి "ఏంటి తండ్రీకొడుకులు తెగ మాట్లాడు కుంటున్నారు?" అంది. అప్పుడు నాన్నగారు "ఏముంది నీ గురించే" అంటు హాస్యంగా అమ్మ మాటను దాటవేశారు. తరువాత నన్ను "నీ చదువు ఎలా

సాగుతోంది?" అని అడిగారు. బాగానె సాగుతోంది నాకు ఆకాశమంత ఎత్తుకు ఎదగాలని వుంది అన్నాను. అప్పుడు నాన్నగారు Englishలో "You may be flying very high in the sky, but never ever forget that you have to land on the earth and walk on it again". ఇంతలో నర్సు వచ్చి నాన్నగారిని చెక్ చేసి అంతా బాగానె వుంది. ఈ రోజు మీరు ఇంటికి వెళ్ళవచ్చు అంది. నాన్నగారు అన్న ఈ వాక్యం నాకు పూర్తిగా అర్థం కాలేదు. విడమరిచి అడుగుదామను కుంటూవుంటే నర్సు రావడంతో అందరు లేవడం వల్ల సందడి పెరగింది. సాయంత్రం ఇంటికి వచ్చాక అడుగుదామని వూరుకున్నాను. తరువాత నాకు మళ్ళీ అవకాశం రాలేదు. ఎందుకంటే, ఆరోజు మానాన్నగారి జీవితంలో ఆఖరి రోజు. ఈ వాక్యం నన్ను ప్రతిరోజు అలోచింపజేయిస్తూ వుంటుంది. పై వాక్యం నాకు ఇలా అర్థం అయ్యింది. 1. ఆశలు ఆకాశాన్నటడంలో తప్పులేదు కాని నేల విడిచి సాము చేయరాదు. 2. ఆకాశంలోని మేఘానికి కూడ వర్షం కురిసి నేల చేరినప్పుడే విలువ. 3. రాజుకి కిరీటం తలమీద వున్నా ప్రజల్లోకి వెళ్ళాలంటే కాలి నడకే వారి దగ్గరికి తీసుకు వెళ్ళేది. 4. గమ్యం చేరుకున్నాక నీ ఉనికిని మర్చిపోకు (never forget your roots). 5. మహా మంత్రి తిమ్మరుసులవారు, పట్టాభిషేకానికి సిద్ధమవుతున్న శ్రీ కృష్ణదేవరాయలులవారిని చెంపదెబ్బ వేసి సామాన్య జనాన్ని మర్చి పోవద్దన్న వైనం కూడ గుర్తుకు వస్తూంటుంది. ఇలా అలొచించినా కొద్ది కొత్త అర్థాలు, విలువలు ఎన్నేన్నో. నిరంతరం నన్ను అలోచింపచేస్తూ నాకు మార్గదర్శకులైన మానాన్నకు జేజే.

సహనానికి మారుపేర్లు, త్యాగమూర్తులు, అయిన తలిదండ్రులందరికి ఇవే నా శతకోటి వందనాలు. నాకు జన్మనిచ్చి, విద్యా బుద్ధులు నేర్పి, ప్రపంచావగహన కలిగించి, నన్ను ఒక వ్యక్తిగా తీర్చి దిద్దిన మా అమ్మ నాన్నలకు జేజే లు.

కాలిఫోర్నియ తెలుగు సమితి

స్వర్ణలోయలో తెలుగు వెలుగు

# తెలుగువాణి

2013

సంపుటి : 2

సంచిక : 1

పుట : 16

---

## ప్రాతఃకాలము



పచ్చికబయళ్ళ పరిసరాలు, పరిశుద్ధమైన పైరగాలి
ఉషోదయానికి ఉవ్విళ్ళూరుతున్న పుడమితల్లి పులకింతలు
సూత్రమేమిలేని స్వాభావిక ప్రకృతి పారవశ్యము
సూర్యుని లేతకిరణాలను పరావర్తనము చేస్తున్న ఆచిన్ని మంచుముత్యాలు
ఉదయానికి ఊపిరిపోస్తున్నట్లున్న పక్షుల కిలకిలారావాలు
భానునిరాకతో విశ్వమంతా విరబూస్తున్న ఆ వింతశోభ
జగత్తునంతటిని ప్రక్షాళన చేస్తున్నట్లున్నది
**ఈ ప్రభాతసమయాన !**

–మధుప్రియ